క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : ఉస్మాన్‌నగర్ ఫీడర్‌లైన్ నందు మంగళవారం మరమ్మతులు చేపడుతున్నందు వలన విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుందని నార్త్ ఏఈ వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని ఎర్రబల్లి బైపాస్, బోయపాళెం, ఈడిగపాళెం, జౌళీబజార్‌తో పాటు పరిసర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలియజేశారు.

ఇంటింటి సర్వే

వీరబల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారుల సేవలు అభినందనీయమని ప్రిన్సిపల్ అజంతుల్లా అన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఆరవ రోజు దత్తత గ్రామమైన పెద్ద మాదిగపల్లి నందు సామాజిక సాధికారిక సర్వే ఇంటింటికి వెళ్లి నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ భాస్కర్, రఘురామయ్య, వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా వెంకట సుబ్బారెడ్డి



సంబేపల్లె : సంబేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.వెంకటసుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాలమేరకు వైఎస్ఆర్ కడప జిల్లా సీకే దిన్నె మండలం డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై సంబేపల్లె మండల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో వుంటానని తెలిపారు.

పకడ్బందీగా రీసర్వే

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గొల్లపల్లిలో సోమశిల వెనుక జలాల వల్ల ముంపునకు గురవుతున్న ప్రాంత భూ సేకరణకు సంబంధించిన సర్వే 175 రోజుల్లో పూర్తి చేయాలని రీసర్వే స్పెషల్ ఆఫీసర్(డిప్యూటీ డైరెక్టర్) శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. సోమవారం దీనిపై ఆయన మండల సర్వేయర్ జి. ప్రియాంక, విలేజ్ సర్వేయర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ముంపునకు గురయ్యే ప్రాంత పొలాల రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. రీసర్వేను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ అంజయ్య, మండలంలోని విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నియామకం

రైల్వేకోడూరు : ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంటుగా పుల్లంపేటకు చెందిన అవ్వారు శ్రీనివాసులు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా అవ్వారు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యాశాఖలో బోధనేతర సిబ్బంది అధికారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మా పొలాలను కాపాడండి

చిన్నమండెం : మా పంట పొలాలను కాపాడండి సారూ అంటూ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న సులోచనమ్మ సోమవారం స్థానిక తహసీల్దార్ నరసింహులుకు ఫిర్యాదు చేశారు. ఆమె చెప్పిన మేరకు వివరాలు.. సర్వే 106లో 50 సెంట్లు, సర్వే నెంబర్ 107లో 28 సెంట్లు, సర్వే నెంబర్125/1లో 27 సెంట్ల భూమి కలదని వరిమాడి నాటేందుకు దుక్కి దున్ని సిద్ధం చేస్తుండగా ఈ భూమికి ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు మాపై గుండాయిజం చేస్తూ మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి మాకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను సులోచనమ్మ కోరారు.

వంక ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

రాయచోటి జగదాంబసెంటర్ : గత నెల 19వ తేదీన కురిసిన అకాల వర్షానికి డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించడంతో పాప గల్లంతు కావడానికి కారణం వంక ఆక్రమణే అని అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు ఆ ప్రాంత ప్రజలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ రాయచోటిలోని డైట్ పార్క్ దగ్గర వంక ఆక్రమణకు గురికావడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ నిర్మాణాలు చేపట్టడం వలన పాప గల్లంతై మృతిచెందిందని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు చెప్పారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

చిట్వేలి : మండల పరిధిలోని వెంకటరాజుపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో గత శనివారం ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారంతో వైభవంగా ముగిశాయి. సోమవారం మధ్య శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ సమేత విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టతోపాటు నాగులస్వామి వారి నూతన బింబ ప్రతిష్ట, శ్రీ అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలు వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం,గ్రామోత్సవం ఘనంగా జరిపారు.

కల్తీ మద్యంతో పేదల జేబులు కొట్టారు

- రాజంపేట ఎక్సైజ్ ఆఫీసు ఎదుట బైఠాయింపు
- నిరసన గళం వినిపించిన మహిళలు
- సీఎం, డిప్యూటీ సీఎంలను దుయ్యబట్టిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం



రాజంపేట: ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు



రాజంపేట: ఎక్సైజ్ ఎస్ఐలకు వినతి పత్రం అందజేస్తున్న మహిళా నేతలు

రాజంపేట : కూటమి నాయకుల కల్తీ మద్యం తయారీకి వ్యతిరేకంగా మహిళలు సోమవారం రాజంపేటలో కదంతొక్కారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతృత్వంలో ఎక్సైజ్ ఆఫీసు ఎదుట వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మహిళల నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యాలయం ఎదుట బైఠాయించారు. మద్యం విధానంలో లోపాలు ఉన్నాయని, కల్తీ మద్యంతో అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయంటూ గళం విప్పారు. ఇంత జరుగుతున్న పట్టించుకోకపోవడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై మహిళలు నిప్పులు చెరిగారు. మద్యం విధానంలో కూటమి ప్రభుత్వం విఫలమైందంటూ దుయ్యబట్టారు. ఎన్ బ్రాండు మద్యం జనం ప్రాణాలను తీస్తోందంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో వైఎస్సార్‌సీపీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి రక్కాసీ శ్రీవాణి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మిరియాల సురేఖ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు చంద్రలీల, నందలూరు వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, రాజంపేట అధ్యక్షురాలు రమణమ్మతో పాటు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐలకు వినతిపత్రం

అనంతరం ఎక్సైజ్ శాఖ ఎస్ఐలు బండారు సుధాకర్, ఎల్.హేమకుమార్‌లకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం తరుపున వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మహిళా నేతలతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, మండలపార్టీ గ్రామీణ కన్వీనరు దొడ్డిపల్లె భాస్కర్‌రాజు, బీసీ నేత వడ్డే రమణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, నేతలు నడివీధి సుధాకర్, జీవీ సుబ్బరాజు, దాసరి పెంచలయ్య, ఖాజా మొహిద్దీన్, బుజ్జా పెంచలయ్య, కల్యాణ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సరేంద్ర, కౌన్సిలర్ ఖాజా, రమేష్‌నాయుడు, గోవిందు బాలకృష్ణ, చికెన్ శ్రీను, సొంటెత్తిన శ్రీనివాసులు, జుబేద్, బాలిరెడ్డి, శివ, కళ్యాణ్, నందలూరు నేతలు పెనుబాల నాగసుబ్బయ్య, గుండు మల్లికార్జునరెడ్డి, అజీజ్, భాస్కర్‌యాదవ్, ఇబ్బు, ఎల్లయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

అరికట్టకపోతే ఉద్యమం తీవ్రతరం



మద్యం మత్తులో కూటమి పాలన జరుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మద్యం విధానం పకడ్బందీగా సాగింది. ప్రస్తుత కూటమి పాలనలో గ్రామగ్రామాన బెల్టుషాపులు ఉన్నాయి. అన్ని తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లో నడుస్తున్నాయన్నారు. ములకలచెరువులో కల్తీమద్యం సంఘటన జనాన్ని కలవరపాటుకు గురిచేసింది. కల్తీ మద్యం అరికట్టకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాల్సి ఉంటుంది.

– ఏకుల రాజేశ్వరీరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ, మహిళా విభాగం

సీబీఐతో దర్యాప్తు చేయాలి



కల్తీ మద్యం కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలి. కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. వైన్ షాపు కేటాయింపులలో జరిగిన అక్రమాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. మద్యం షాపులను ప్రభుత్వమే నడపాలి. గ్రామాల్లో పుట్టుకొస్తున్న బెల్టుషాపులను లేకుండా చేయాలి. మద్యం అమ్మకాలను నియంత్రించే విధంగా విధానాలను రూపకల్పన చేయాలి.

– రక్కాసి శ్రీవాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం, వైఎస్సార్‌సీపీ

కల్తీ మద్యం ఘటనకు సీఎం, డిప్యూటీ సీఎం బాధ్యులు



రాష్ట్రంలో కల్తీ మద్యం తయారుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యులు. కల్తీ మద్యం ఏరులైపారుతున్న, దారి మళ్లింపు రాజకీయాలు, ప్రచారంతో కాలాన్ని కూటమి ప్రభుత్వం నెట్టుకొస్తోంది. కల్తీమద్యం కేసు నీరుగార్చేందుకు సీఎం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన ప్రభుత్వం ప్రాణాలను హరించేలా వ్యవహరిస్తుండటం సిగ్గుచేటు.

– మిరియాల సురేఖ, నియోజకవర్గ అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం

సామూహిక దేవస్థానాల ఈఓగా వెంకటసుబ్బారెడ్డి

రాజంపేట రూరల్ : రాజంపేట డివిజనల్ దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని సామూహిక దేవస్థానాల ఈఓగా స్థానిక అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలోని కార్యాలయంలో సోమవారం నూకా వెంకటసుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 3 సంవత్సరాల క్రితం వెంకటసుబ్బారెడ్డి ఇక్కడ ఈఓగా విధులు నిర్వర్తించారు. ఇక్కడ నుండి చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి రాజంపేట డివిజనల్ సామూహిక దేవస్థానాల ఈఓగా బదిలీపై వచ్చారు.

పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణంలోని అభి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర మైనార్టీ శాఖ మాజీ కమిషనర్ ఇక్బాల్ కుమారుడి నిఖా వేడుకలకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు రాయచోటికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు బేపారి మహమ్మద్ ఆయనకు ఘన స్వాగతం పలికారు.

పాఠ్యాంశాలపై అవగాహన

పుల్లంపేట : విద్యార్థులకు ప్రయోగాలు ద్వారా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు మండలంలోని దళవాయిపల్లి ఆదర్శపాఠశాల ఉపాధ్యాయుడు రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల విజ్ఞానం, మానవుని అవయవ వ్యవస్థ అనే పాఠ్యాంశం గురించి సోమవారం ప్రయోగాలు ద్వారా వివరించారు. తదుపరి ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరేళ్ల రమణమ్మ

రాజంపేట టౌన్ : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్యంపై సచివాలయ శానిటేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) ఆరేళ్ల రమణమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సోమవారం ఎంపీడీఓ పగడాల వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించకుంటే చెత్త పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతాయని, దోమల వల్ల జ్వరాలు ప్రబలే ప్రమాదముందన్నారు. ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఆయా గ్రామ సచివాలయ శానిటేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది వర్షాలు కురవకుంటే వచ్చే ఏడాది వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంటుందని, అందువల్ల ముందుగానే నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలను గుర్తించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తినా అధికమించేందుకు కొన్ని నెలల ముందు నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలియజేశారు. వైద్య సిబ్బంది శీతాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు విధిగా ఇవ్వాలన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అధికారులు వారికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఇదిలావుండగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమశాఖల ప్రగతిని సమావేశంలో వివరించారు. అలాగే తమశాఖల ద్వారా చేపట్టే పనుల వివరాలను తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామసచివాలయ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఇంటికి సోలార్‌ను ఏర్పాటు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, అంతేకాక విద్యుత్ ఎంతో ఆదా అవుతుందని, ఈ విషయంపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు.

అనుమతులు పొందితేనే డీజే

రాయచోటి టౌన్ : ఎక్కడైనా ఎలాంటి ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునే వారు డీజే సౌండ్ సిస్టమ్ పెట్టాలంటే పోలీసుల అనుమతులు తప్పకుండా ఉండాలని రాయచోటి డివిజన్ స్థాయి డీజే సిస్టమ్ యజమానులు, యూనియన్ నాయకులకు సూచించారు. సోమవారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ–2 విష్ణువర్ధన్ సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. పెళ్లిళ్లు, ఉత్సవాలు, వేడుకలు, జాతర్లు వంటి కార్యక్రమాల నిర్వహణలో డీజే సిస్టంల ద్వారా అధిక శబ్దం వెలువడేలా చేస్తున్నారన్నారు. దీని వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది కాబట్టి నియంత్రించే క్రమంలో రాత్రి 10 తరువాత వాల్యూమ్ (శబ్దం) తగ్గించి, ప్రజలకు ఇబ్బంది కలగనీయకుండా చూసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

‘టీడీపీ నేతల కనుసన్నల్లోనే కల్తీ మద్యం’



రాయచోటి ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

- రాయచోటి ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళల నిరసన

రాయచోటి అర్బన్ : కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని కూటమి ప్రభుత్వంపై మహిళలు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు కల్తీ మద్యానికి వ్యతిరేకంగా మహిళలు శాంతియుతంగా నిరసన చేపట్టి, కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలంటూ ఎక్సైజ్ కార్యాలయం రాయచోటి ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జిల్లా మహిళా కార్యదర్శి సరియా, సభ్యురాళ్లు మాదారబీ, అరీఫా, రజియా సుల్తానా, నాయకులు హబీబుల్లా ఖాన్, ఆసీఫుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు తీస్తున్నారు

ఎక్సైజ్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ పర్వీన్, పట్టణ అధ్యక్షురాలు నాజనీన్‌లు మాట్లాడుతూ టీడీపీ నేత కనుసన్నల్లోనే కల్తీ మద్యం తయారు చేసి నేరుగా హోటళ్లు, దాబాలు, రోడ్డు పక్కన ఉన్న అంగళ్లు, బెల్టు షాపులకు సరఫరా చేసి, అమ్మకాలు చేస్తున్నారని విమర్శించారు. రెట్టింపు సంక్షేమం అమలు చేస్తామని గద్దెనెక్కి ప్రజల ప్రాణాలు తీసేలా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆదాయమే పరమావధిగా కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను తీస్తున్నారంటూ కూటమి నేతలపై ధ్వజమెత్తారు. కల్తీ మద్యాన్ని ఓ కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అక్రమ దందా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి కల్తీ మద్యంపై కఠిన చర్యలు తీసుకుని, అందులో ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కోడూరులో కదంతొక్కిన మహిళామణులు



రైల్వేకోడూరు అర్బన్: ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైఠాయించిన మహిళలు



రైల్వేకోడూరు అర్బన్: మహిళలతో కలిసి నిరసనలో పాల్గొన్న కొరముట్ల

- ఎన్ బ్రాండ్ కల్తీ లిక్కర్‌పై మహిళల ఆగ్రహం
- పేదల ప్రాణాలు హరించారంటూ మండిపాటు
- కల్తీ మద్యంతో ప్రజల సొత్తు దోచేశారు
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన

రైల్వేకోడూరు అర్బన్ : చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం విచ్చలవిడిగా ఏరులై పారించి పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. కల్తీ మద్యంపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలతో కలిసి నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో కల్తీ మద్యం విచ్చలవిడిగా విక్రయించారన్నారు. సీఎం చంద్రబాబు పేదల సొమ్ము దోచుకోవడానికి తన మనుషులతో కల్తీ మద్యం తయారుచేయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. నారా వారి కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో గడిచిన 14 నెలలో 673 మంది చనిపోయారని, అలాగే తెలుగు తమ్ముళ్లు రూ.5,600 కోట్లు ప్రజల సొమ్ము కొల్లగొట్టారని మండిపడ్డారు. కల్తీ మద్యం వల్ల ప్రాణాలు పోయి వీధిన పడ్డ పేద కుటుంబాల ఉసురు చంద్రబాబుకు, కూటమికి తగలక తప్పదని చెప్పారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దశలవారీగా మద్యనిషేధం చేయడానికి బెల్ట్ షాపులన్నీ రద్దు చేసి ప్రభుత్వమే పరిమితంగా షాపులు నిర్వహిస్తే, చంద్రబాబు గెలిచాక కల్తీ మద్యమే వారి నాయకులకు ఆదాయ వనరులుగా చేశారని విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ షాపులు నిర్వహిస్తూ.. చంద్రబాబు సొంత జిల్లాలో టీడీపీ ఇన్‌చార్జ్‌కు సంబంధించిన వ్యక్తి నకిలీ మద్యం తయారు చేయడానికి చిన్నపాటి పరిశ్రమనే పెట్టుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల ప్రాణాలకు అండగా ఉండి వారి తరఫున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షులు ముద్దా బాబుల్‌రెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఓబులవారిపల్లి పార్టీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, చిట్వేలి అధ్యక్షులు చెవ్వు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు వెలగచర్ల శివప్రసాద్‌రెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, శంకరయ్య, రాజ, మహేష్, నంద బాల, ముస్తాక్, భరత్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రాంనాథ్, మారెళ్ల రాజేశ్వరమ్మ, లక్ష్మీనారాయణమ్మ, పుష్పలత, బండారు మల్లికార్జున, డీవీ రమణ, సిద్దయ్య, కరీముల్లా, పెద్ద ఎత్తున మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి మేలు

నందలూరు : జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతుందని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి,ఎంపీడీఓ రాధాకృష్ణన్‌లు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి కనీసం రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదా కలుగుతుందని, ప్రతి దుకాణం ఎదుట తగ్గించిన జీఎస్టీ వివరాలు పొందుపరచాలని, ఇందుకు ప్రతి దుకాణదారులతో పాటు ప్రజలు కూడా జీఎస్టీ తగ్గింపు వల్ల తాము పొందుతున్న ఆదాను తెలుసుకోవాలని తెలియజేశారు.

సీజేఐపై దాడి హేయం

రాయచోటి టౌన్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి కోట దానియేలు మాదిగ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా సీజేఐపై లాయర్ రాకేష్ కిశోర్ చేసిన దాడికి నిరసనగా మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో కలసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ జస్టిస్‌పై దాడి చేయడం హేయమన్నారు. దాడికి పాల్పడ్డ రాకేష్ కిశోర్‌పై సుమోటో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

15 నుంచి విద్యుత్ కార్మికుల సమ్మెబాట

రాజంపేట రూరల్ /రాయచోటి టౌన్ : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు వెళ్లనున్నట్లు యూఈఈసీడబ్ల్యూయూ డివిజన్ కార్యదర్శి పిండిబోయిన బాలకృష్ణ, స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పోతులూరి సుదర్శన్ రెడ్డిలు తెలియజేశారు. రాజంపేట, రాయచోటిలోని విద్యుత్ కార్యాలయాల ఆవరణలో సోమవారం విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అనంతరం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూఈఈయూ, యూఈసీడబ్ల్యూయూ, స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఒన్ ఇండస్ట్రీ ఒన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేయాలన్నారు. గ్రేడ్–2 కార్మికులకు న్యాయం చేసే వరకు పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలన్నారు. కారుణ్య నియామకాలలో జరుగుతున్న అన్యాయాన్ని నివారించాలన్నారు. నగదు రహిత అపరిమిత మెడికల్ పాలసీని వర్తింపజేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కోటి రూపాయలు ఇన్సూరెన్స్ చేసి దళారీ వ్యవస్థ లేకుండా కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. అలానే పెండింగ్ డీఏలు విడుదల చేయాలని చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న సీపీఐ



ఓబిలిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్న సీపీఐ నాయకులు, గ్రామస్తులు

పెనగలూరు : మండలంలోని ఓబిలి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను సీపీఐ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. నందలూరు మండలం టంగుటూరు రీచ్‌కు సంబంధించి వర్షానికి ముందు కుందా నెల్లూరు దగ్గర ఇసుక రీచ్‌ను అధికారులు గుర్తించారు. రీచ్ నుంచి ఇసుకను తరలించుకునే వారు. వర్షం తరువాత టంగుటూరు, ఓబిలి రోడ్డు తెగిపోవడంతో ఓబిలి సమీపంలో హిటాచీతో నిబంధనలకు విరుద్ధంగా రాత్రింబవళ్లు టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో లోడింగ్ చేస్తున్న వాహనం వద్దకు వచ్చి ఆపివేసి గుంతను పరిశీలించారు. ఈ దారి గుండా పాఠశాలలకు పిల్లలు వెళ్లేటప్పుడు పొరపాటున నీటి గుంతలో పడితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నయ్య అన్నారు. అనంతరం తహసీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఆదినారాయణ, నారాయణ రేవూరి, శంకరయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుల్లంపేట : రాష్ట్రస్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల పీడీ నీలకంఠరావు తెలిపారు. సోమవారం చిన్నమండెంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ పోటీల్లో సంధ్య ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు సాహిత్య

రైల్వేకోడూరు : ఈ నెల 10, 11, 12వ తేదీలలో బాపట్ల జిల్లా పెట్లూరులో 69వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ఎస్కే స్పోర్ట్స్ అకాడమీకి చెందిన సాహిత్య అండర్–14 విభాగంలో బంగారు పతకం సాధించాడు. అలానే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎస్కె మాలా తెలిపారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

చిన్నమండెం : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నటువంటి ఉపాధి హామీ శ్రామికులు కార్డులోని ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఏపీఓ మురళి సూచించారు. సోమవారం పాలిమేరపల్లిలో ఆయన పర్యటించి కూలీలతో ఈకేవైసీ చేయించారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దప్పేపల్లి గ్రామం వీరారెడ్డిగారిపల్లికి చెందిన సురేంద్రారెడ్డి తల్లి యర్రదొడ్డి రెడ్డమ్మ (65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు రెడ్డమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

లింగ వివక్షను నిర్మూలించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : సమాజంలో ఆడపిల్లలపై ఉన్న అసమానత్వం, చిన్నచూపు, లింగ వివక్షత సమూల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నమయ్య జిల్లా విస్తృత ఆరోగ్య విద్య అధికారి దేవశిరోమణి తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రాయచోటి కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలోని బాలికలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ హెచ్ఈఓ బలరామరాజు మాట్లాడుతూ సమాజంలో ఆడ మగ ఇరువురు సమానమేనని లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే వారికి చట్టరీత్యా కఠిన శిక్షలు జైలు, జరిమానా విధిస్తామన్నారు.

వీఆర్ఏల వేతనం పెంచాలి

సిద్దవటం : వీఆర్ఏలవేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు బోవిళ్ల దేవదాసు డిమాండ్ చేశారు. సిద్దవటంలో సోమవారం మండల వీఆర్ఏల సంఘం సమావేశం జరిగింది. దేవదాసు మాట్లాడుతూ చదువుకున్న వీఆర్ఏల డిమాండ్‌లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు.

విద్యార్థులు సామాజిక సేవ చేయాలి

పెనగలూరు : మోడల్ స్కూల్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ క్యాంపు నిర్వహించినట్టు ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ తెలిపారు. ఎన్ఎస్ఎస్ క్యాంపు ఏడురోజులపాటు జరుగుతుందని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత తదితర పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

ఎంపీ నిధులతో రహదారి నిర్మాణం

రాజంపేట రూరల్ : రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి రూ.5 లక్షల నిధులతో మంజూరైనరహదారి నిర్మాణానికి మండల పరిధిలోని కె.బోయినపల్లిలో సోమవారం సర్పంచ్ బోగా రాజా పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొడిచెర్ల శివ, బొడిచెర్ల సుబ్బరాయుడు, మాడా అహోబిలం పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూప్‌పై విచారణ చేపట్టండి

రాయచోటి అర్బన్ : శ్రీ చౌడేశ్వరమ్మ డ్వాక్రా గ్రూప్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలని సోమవారం బాధితులతో కలిసి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ మాజీ సభ్యులు ఎస్.సాయికుమార్ కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. 2024 జనవరి 11న రూ.12లక్షలు లోన్ మంజూరు కాగా గ్రూపులో 9 మందికి ఒక్కొక్కరికి రూ.97వేలు జమచేశారని, మిగిలిన నగదు ఏమైందో తెలియదని, ఈ విషయాన్ని తేల్చాల్సిన అవసరం ఉందని కోరారు.